సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 7 । డిసెంబర్ । 2023



దివ్యాంగులకు డిజిటల్ బోధన

ప్రభుత్వం దివ్యాంగులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తోంది.




పాక కూలి వృద్ధుడి మృతి

మండల పరిధిలో జి.మేడపాడు ఎస్సీ కాలనీలో ఒక పాక కూలి పోవడంతో మంచంపై నిద్ర పోతున్న వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

8లో

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,03,111 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

సహాయక చర్యలపై ఎంపీ ఆరా



తుపాను ప్రాంతాలలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీ భరత్‌రామ్ కోరారు. కాలువల్లో పూడికతీత పనులు తక్షణమే చేపట్టాలన్నారు. రాజమహేంద్రవరంలో ముంపు బాధిత ప్రాంతాలలో కమిషనర్ దినేష్‌కుమార్‌తో కలసి ఆయన బుధవారం తిరిగారు. మురుగునీరు నిలిచిపోవడం గమనించి తక్షణమే స్పందించాలని శానిటేషన్ సిబ్బందికి సూచనలిచ్చారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. పాలు, వాటర్ ప్యాకెట్లు అందిందీ లేనిదీ తెలుసుకున్నారు. అవసరమైతే ఆహార పొట్లాలను కూడా అందించాలని కమిషనరుకు చెప్పారు. ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచినీరు సరఫరా చేయాలన్నారు. మిచౌంగ్ తుపాను యావత్ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిందన్నారు. సుడిగాలి, భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులు, కమిషనర్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారన్నారు. చాలా ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటిని తోడేందుకు కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణలో మోటార్లను ఏర్పాటు చేశారన్నారు. పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

రాజమహేంద్రవరం రూరల్: పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కీలక బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 2, 3 తేదీలలో నిర్వహించిన ఓటరు జాబితాల పరిశీలన, ఓటు నమోదు, గుర్తింపు కోసం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు 17,924 దరఖాస్తులు వచ్చాయన్నారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీలు మరింత చురుకైనా పాత్ర పోషించాలన్నారు. జిల్లా ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.యువరాజ్ ఈ నెల 8న పర్యటిస్తారన్నారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.రామచంద్రరావు, కె.రాజశేఖర్, పీఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధిత రైతులకు అండగా ప్రభుత్వం

తొండంగి: మిచాంగ్ తుపాను ప్రభావ బాధిత రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆర్అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా చెప్పారు. ఏ.కొత్తపల్లిలో బారీ వర్షాలకు దెబ్బతిన పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత బెండపూడి తారకరామ కాలనీలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరంతా పోలవరం కాలువ గట్టుపైకి అడ్డు వచ్చి తమను ముంచెత్తుతుందని గ్రామస్తులు మంత్రి రాజా వద్ద వాపోయారు. ముంపు తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన డ్రైన్లు తవ్వి పైపులు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని పోలవరం డీఈ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అనంతరం ఏ.కొత్తపల్లిలో సుడిగాలికి దెబ్బతిన్న తలపులమ్మ మెట్ట ప్రాంతం, ఎస్సీకాలనీల్లో ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. దాదాపు మూడు అడుగుల లోతున ఈ ప్రాంతం నిండిపోయింది. బురద నీటిలో నుంచి మంత్రి నడిచి వెళ్లి దెబ్బతిన్న ఇళ్లను చూశారు. తక్షణ సహాయంగా ఆయన రూ.లక్ష బాధితులకు అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం, పునరావాసం, నిత్యావసర వస్తువులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

ఏలేరులోకి నీరు

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఏలేరు జలాశయంలోకి బుధవారం 5,578 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోని భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 79.10 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 12.43 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. వర్షాలకు ప్రాజెక్టులో మరింతగా నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

గండం గడిచింది

- మిచాంగ్ తుపాను బలహీన పడటంతో తప్పిన ఆందోళన
- కుదుటపడిన వాతావరణం
- తుపాను ప్రభావంతో రికార్డు స్థాయిలో వర్షం
- తుపాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్న యంత్రాంగం
- ముందస్తు స్పందనకు హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొవ్వూరు పట్టణ శివారులో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి వివేక్ యాదవ్,ఇతర జిల్లా అధికారులు



జిల్లాలో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగిన చోట ఈపీడీసీఎల్ అధికారులు తక్షణమే స్పందించి పునరుద్ధరణకు తీసుకున్న చర్యలకు సాక్ష్యమిది..

సాక్షి, రాజమహేంద్రవరం: మిచాంగ్ తుపాను ఆందోళన ముగిసింది. మూడు రోజులుగా కురిసిన వర్షం బుధవారం తెరపివ్వడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు రేకుల షెడ్లు, వృక్షాలు, విద్యుత్ వైర్లు, స్తంభాలు నేలకొరిగాయి. 1457 హెక్టార్లలో వరి పంట నీటి మునగడం మినహా ఆస్తి, ప్రాణ నష్టాలు చోటు చేసుకోలేదని అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. అంతర్గత రహదారులు మినహా మరెక్కడ పెద్దగా నీరు ప్రవహించిన దాఖలాలు లేవు. ఒక్కసారిగా మంగళవారం రాత్రి భారీవర్షం కురవడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. చిరు వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తాయి. ఈదురుగాలులకు చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అధికారులు స్పందించిన తీరును చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫలితమిచ్చిన ముందస్తు అప్రమత్తత

తుపాను హెచ్చరికల నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగానే అప్రమత్తమయ్యారు. తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురవడం ప్రారంభమవ్వగానే జిల్లా స్థాయి అధికారులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అప్రమత్తం చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు సాగుతున్న దృష్ట్యా రైతులు గింజ ధాన్యం కూడా నష్టపోకూడదన్న తలంపుతో చర్యలు ప్రారంభించారు. కోతలు కోసిన, రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా ఆఫ్‌లైన్‌లోనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు.

వర్షం ఆగే వరకు కోతల జోలికి పోవద్దని రైతులకు సూచించారు. ఫలితంగా కోసిన ధాన్యం నీటిలో తడిసి నష్టపోకుండా నివారించగలిగారు.

అధికారులందరూ క్షేత్రస్థాయిలోనే..

తుపాను ప్రభావంతో చినుకు ప్రారంభమైనప్పటి నుంచి కలెక్టర్ మాధవీలతతోసహా అధికారులందరూ క్షేత్ర స్థాయిలో ఉన్నారు. శాఖల వారీగా విధులు కేటాయించారు. ప్రజలు, రైతుల సహాయార్థం సలహాలు, సూచనలు, సహాయక చర్యలకు కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందని అప్రమత్తం చేసి రైతుల్లో అవగాహన కల్పించారు. ఉద్యాన, పశుసంవర్ధక అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేశారు. వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన మందులు సిద్ధంగా పెట్టారు. రహదారులు, అగ్నిమాపక శాఖ, మున్సిపల్, పంచాయతీ అధికారులను ప్రజలకు అందుబాటులో ఉంచారు. వీరితో పాటు గ్రామ, వార్డు వలంటీర్ల సేవలను సైతం వినియోగించుకున్నారు.

ప్రత్యేకాధికారి పర్యటన

తుపాను పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్ కొవ్వూరులో నీటిలో మునిగిన పంటలను పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సూచనలు చేశారు. ఉద్యాన పంటలకు సంబంధించి అరటి, టమోటా, దోస పంటలకు నష్టం వాటిల్లిందని, క్షేత్రస్థాయిలో ఆయా ఆర్బీకేల వారీగా వివరాలు సేకరిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా లోతట్టు ప్రాంతాల్లో డికల్ క్యాంపులు ఏర్పాటు చేసి 128 మంది గర్భిణులకు మందులు అందిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉంచామని కలెక్టర్ చెప్పారు.

వ్యవసాయ శాఖకు నష్టం

భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా కొంత మేర పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 13 మండలాల పరిధిలో 107 గ్రామాల్లో వర్షం ప్రభావం చూపింది. ఖరీఫ్‌లో 70,827 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. ఇప్పటికే 65.5 శాతం కోతలు పూర్తయ్యాయి. 3,276 హెక్టార్లలో వరి పంట నేలకొరిగింది. 2,446 హెక్టార్లలో పంట మునిగింది. నష్టాన్ని తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై 1859 హెక్టార్లలో నీటిని బయటకు పంపించింది. నేలకొరిగిన వరి మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రవణాన్ని పిచికారి చేయాలని రైతులకు సూచించింది.



పెరవలి మండలంలో ముంపులో ఉన్న కూరగాయల పాదులు



గోపాలపురం మండలం పెద్దాపురంలో నీటమునిగిన పొగాకు తోట

విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం



జిల్లాలో భారీ వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఇలా కుప్పకూలాయి..

తుపాను ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షం ధాటికి 475 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 140 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వెరసి రూ.2.25 కోట్ల నష్టం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశాయి.

ధాన్యం మిల్లుకు పంపించారు



వ్యవసాయాధికారులు ముందుగా టాంటాం ద్వారా తెలియజేశారు. పంటలను కాపాడుకోవటానికి తగిన సూచనలు ఇచ్చారు. ఆదివారం ఉదయమే ధాన్యాన్ని మిల్లుకి దగ్గరుండి పంపించారు. ఈ విషయంలో సచివాలయ ఉద్యోగులు బాగా సహకరించారు. అందువల్లే పంటకు నష్టం జరగలేదు.

– దిద్ల సంపతిరావు ఖండవల్లి

సచివాలయ సిబ్బంది సహకారం



ఎకరం పొలం కౌలుకి తీసుకుని వరి వేశాను. శనివారం కోత కోశాం. తుపాన్ గురించి సచివాలయ సిబ్బంది చెప్పారు. ఆదివారం ఉదయం వచ్చి ధాన్యం ఎలా ఉన్నా మిల్లుకు పంపాలని చెప్పారు. తరలించేలా చూశారు. ఆ సాయంత్రమే వర్షం కురవటం ప్రారంభమైయ్యింది.

– సరిపల్లి బుజ్జిబాబు లంకమాలపల్లి

నిరాశ్రయుల కోసం పునరావాస కేంద్రాలు



నల్లజర్లలో ముంపు బాధిత కుటుంబాలకు బియ్యం, ఇతర ఆహార సామగ్రి అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూర ఆర్డీఓ కృష్ణ నాయక్ తదితరులు

- ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే తలారి, ఆర్డీఓ నాయక్ పర్యటన
- బాధిత కుటుంబాలకు రేషన్ కిట్ల పంపిణీ

నల్లజర్ల: తుపాను ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకు మండలంలోని ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద మండలంలోని పలు గ్రామాలను ముంచెత్తింది. ఘంటావారిగూడెం, నల్లజర్ల, జగన్నాథపురం, శింగరాజుపాలెంలలో దాదాపు 300 గృహాలు నీట మునిగాయి. రెవెన్యూ, పంచాయతీ శాఖల సిబ్బంది ఆయా గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాల వెనుక గల 82 ఇళ్లలోకి వరద చేరడంతో వారందరికీ ఎస్ఆర్‌కే కళాశాలలో పునరావాసం కల్పించారు. అలాగే జగన్నాథపురంలో 200 గృహాలు నీట మునిగినట్టు సర్పంచ్ చెల్లారి రామ శ్రీనివాస్ తెలిపారు. వారందరికీ గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో పునరావాసం ఏర్పాటు చేసి, భోజన వసతి కల్పించారు. ఇక్కడ ఈఓపీఆర్డీ సింహాద్రి దగ్గరుంచి బాధితులను పర్యవేక్షిస్తున్నారు. ఘంటావారిగూడెం ఎస్సీ కాలనీలో 15 ఇళ్లు నీట మునిగాయి. శింగరాజుపాలెంలోని ఊర చెరువు వరద ప్రవాహ ఉధృతి ఎక్కువ కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు ఆర్డీవో కృష్ణ నాయక్, తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖర్, ఏవో కమల్‌రాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు కారుమంచి రమేష్, రాయుడు విజయ కుమార్, మద్దిపాటి ప్రసాద్, యువరాజు, పల్లి సుబ్బారావు, కండెపు రామకృష్ణ, నీరుకొండ జయ కృష్ణ బాధితులను పరామర్శించారు. వ్యాధులు ప్రబలకుండా పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. 25 కిలోల బియ్యం , కిలో వంటనూనె , కిలో ఉల్లిపాయలు, కిలో కందిపప్పు, కిలో బంగాళాదుంపలతో ఒక కిట్‌గా తయారు చేయించి నల్లజర్లలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. పుల్లలపాడులో వరద ప్రవాహ ఉధృతికి రహదారి కోసుకుపోయింది. ఆనంద నిలయం విద్యార్థులకు నంబర్ -1 పాఠశాల పునరావాస కేంద్రంలో భోజనాలు ఏర్పాటు చేశారు. మండలంలోని 650 ఎకరాల్లోని వర్జీనియా పొగాకు, 164 ఎకరాల్లోని వరి, 64ఎకరాల్లోని వేరుశనగ, 79 ఎకరాల్లోని మినుము పంట నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ తెలిపారు.

పంట నష్టంపై వివరాల సేకరణ

- రైతులకు భరోసా కల్పించేలా చూడాలి
- జిల్లా ప్రత్యేక అధికారి వివేక్ యాదవ్



సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రత్యేక అధికారి వివేక్ యాదవ్, కలెక్టర్ మాదవీలత, ఎస్పీ జగదీష్,జేసీ తేజ్‌భరత్, కమిషనర్ దినేష్‌కుమార్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం సిటీ) : మిచాంగ్ తుపానులో భారీ వర్షాల వల్ల సంభవించిన పంట నష్టాలపై రైతులకు పూర్తి భరోసా ఇచ్చేలా అంచనా నివేదిక తయారు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి వివేక్ యాదవ్, కలెక్టర్ డా. కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. తుపాను అనంతరం పరిస్థితులపై తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రత్యేక అధికారితోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ బాధిత రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు భరోసా కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిశాక ప్రత్యేక అధికారి వివేక్ యాదవ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దెబ్బతిన్న రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. డ్రైన్ల మరమ్మతులతోపాటు శానిటేషన్ పై ఫోకస్ పెట్టాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు

తుపాను సందర్భంగా చేపట్టిన చర్యలను కలెక్టర్ మాధవీలత వివరించారు. పంటలు నష్టపోయిన ప్రాంతాలలో వ్యవసాయ శాఖ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయిస్తామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. పొలాల్లో నీటిని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా బయటకు తోడించామన్నారు. అరటి,టమోటా, దోస పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా వెంటనే కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 24 వేల ఎకరాలలో నూర్పిడి చేయాల్సి ఉందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. 128 మంది గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాల్లో ఉంచి మందులు అందజేస్తున్నామన్నారు. ఎస్పీ పి జగదీష్ మాట్లాడుతూ రక్షణ భద్రత విషయంలో సంబంధిత శాఖలతో సమన్వయం సాధించడం జరిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సేకరించిన మిల్లులకు తరలిస్తున్నామన్నారు. మున్సిపల్ కే దినేష్ కుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో తీసుకున్న జాగ్రత్తలను వివరించారు. సమీక్షలో డీఆర్‌ఓ జీ నరసింహులు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు
- ఈనెలలో ఇంత వర్షం ఇదే ప్రథమం
- తాళ్లపూడిలో గరిష్టంగా 288.4 మి.మీ.
- జిల్లాలో ఒక్క రోజులో 166.9 మి.మీ.



రాజమహేంద్రవరంలో వర్షానికి జలమయింగా దేవీచౌక్- పేపర్‌మిల్లు రోడ్డు



శ్యామలా థియేటర్ రహదారిలో..

కొవ్వూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో మంగళవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. డిసెంబర్‌లో భారీస్థాయిలో ఇంత వాన కురవడం ఇదే ప్రథమం. మూడు రోజుల నుంచి సరాసరి 220.5 మి.మీటర్లు నమోదైందంటే ఎంత ఎక్కువ కురిసిందో అర్థం చేసుకోవచ్చు. తాళ్లపూడి మండలంలో గడిచిన మూడు రోజుల వ్యవధిలో రికార్డు స్థాయిలో 288.4 మి.మీ. కురిసింది. పెరవలిలో 282.4, కడియంలో 268.0, గోకవరంలో 245.8 మి.మీ. చొప్పున కురిసింది. కోరుకొండ, బిక్కవోలు, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో మినహా మిగిలిన అన్నీ మండలాల్లోను సరాసరి 20 సెంటీమీటర్లకు పైగా కురిసింది. జిల్లాలో మంగళవారం ఉదయం 8-30 గంటల నుంచి బుధవారం ఉదయం ఎనిమిదిన్నర వరకూ సరాసరి 166.9 మి.మీటర్లు కురిసింది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో సరాసరి 170.2 మి.మీ. కురిస్తే రాజమహేంద్రవరం డివిజన్‌లో 16.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

రికార్డు స్థాయి

జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల్లో తాళ్లపూడి మండలంలో గరిష్టంగా 232.4 మి.మీ. వర్షం కురిసింది. గోకవరంలో 216.4, కడియంలో 200.2, పెరవలిలో 190.2, కొవ్వూరులో 188.0, నల్లజర్లలో 192.8,సీతానగరంలో 182.6, చాగల్లులో 171.8, అనపర్తిలో 156.2,రంగంపేటలో 164.8, రాజమహేంద్రవరం రూరల్‌లో 162.6, రాజమహేంద్రవరంఅర్బన్‌లో 156, నిడదవోలులో 157.4, ఉండ్రాజవరంలో 148.2, కోరుకొండలో 140.0, బిక్కవోలులో 105.2,గోపాలపురంలో 121.4,దేవరపల్లిలో 128.2 మి.మీ. వర్షం కురిసింది.

3 రోజులూ ముంచేసినా తక్కువే

ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం 10002.7 మి.మీ. కురవాల్సి ఉంది. కానీ 920.6 మి.మీ. కురిసింది. అంటే సాధారణం కంటే-8.2 శాతం తక్కువ. గతేడాది ఇదే సమయానికి సరాసరి 1053.9 మి.మీటర్లు వర్షం కురిసింది. డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 17.8 మి.మీ. కురయాల్సి ఉండగా గత మూడు రోజుల్లోనే 4090.5 మి.మీ.కురిసింది.



రాజమహేంద్రవరంలో చెరువును తలపిస్తున్న పేపర్‌మిల్లు రోడ్

జిల్లాలో నెలల వారీగా కురిసిన వర్షం(మి.మీ.)

నెల	సాధారణ	కురిసింది	వ్యత్యాసం (శాతం)
జూన్	117	87.4	-25.3 తక్కువ
జూలై	220.3	273.5	24.2 అధికం
ఆగస్టు	238.6	120.8	-49.4 తక్కువ
సెప్టెంబర్	173.2	161.4	-6.8 సాధారణం
అక్టోబర్	169.1	23.2	-86.3 తక్కువ
నవంబర్	56.8	35.7	-37.2 తక్కువ
డిసెంబర్	0.9	220.5	2,2711.8 అత్యధికం



రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద హోటల్ వైష్ణవి వీధిలో..



అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో..

క్లుప్తంగా

పాక కూలి వృద్ధుడి మృతి



మంచంపై ఉన్న నాగరాజుపై కూలిన పాక



మృతుడు నాగరాజు (పాత చిత్రం)

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు ఎస్సీ కాలనీలో ఒక పాక కూలి పోవడంతో మంచంపై నిద్ర పోతున్న వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తుపాను కారణంగా మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పాక తడిసిపోయింది. బుధవారం ఈదురు గాలికి పాక కూలి మంచంపై పడడంతో ముక్కుర్తి నాగరాజు (62) మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నాయకుడు మోరంపూడి శ్రీరంగనాయకులు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి వీఆర్వోలు, గ్రామ పెద్దలు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించారు.

లారీ ఢీ కొని నర్సు మృతి



ఘటనా స్థలిలో పడిపోయిన సత్యవతిని పైకి లేపుతున్న స్థానికులు

సామర్లకోట: లారీ ఢీకొనడంతో నర్సు మృతి చెందింది. స్థానిక గరువులో నివాసం ఉంటున్న నర్సు దొమ్మేటి సత్యవతి (31) బుధవారం మధ్యాహ్నం స్కూటీపై కాకినాడ వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమె బంధువులు సత్యవతిని హుటాహుటిన ఏడీబీ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొని వెళుతుండగా ఆస్పత్రికి చేరే సమయానికి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం దొమ్మేటి సత్యవతి కాకినాడ జీజీహెచ్‌లో నర్సుగా పని చేస్తోంది. విధులకు హాజరు కావడానికి స్కూటీపై వెళుతూ ఉండగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా స్కూటీని ఢీ కొంది. డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు డిజిటల్ బోధన

- విద్యార్థులతో పాటు ఐఈఆర్‌టీ, స్పెషల్ టీచర్లకు ట్యాబ్స్
- మొదటి విడతగా 160 మందికి పంపిణీ
- విషయం అర్థమయ్యేలా 26 ప్రత్యేక యాప్‌లు
- వినియోగంపై త్వరలో ఒక రోజు ఓరియంటేషన్



దివ్యాంగ చిన్నారికి బోధన చేస్తున్న ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు



విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి ఫిజియో థెరపీ సేవలు అందజేస్తున్న వైద్యుడు

రాయవరం: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలను అందించగా, గత విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌ను అందజేసింది. సాధారణ విద్యార్థులతో పాటు, విభిన్న ప్రతిభావంతులకు కూడా డిజిటల్ విద్యను అందించే దిశగా అడుగులు వేస్తోంది. విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేయించడం, పై చదువులు అభ్యసించేలా 10 మార్కుల ఉత్తీర్ణత కొలమానం చేయడం, సహిత విద్యను అందించేందుకు రీసోర్స్ పర్సన్లు, బాగోగులు చూసేందుకు ఆయాలను నియమించడంతో పాటు, తాజాగా భవిత కేంద్రాల్లో అత్యాధునిక ట్యాబ్స్‌ను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఉన్న 22 భవిత కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు, వారికి బోధన చేసే ఐఈఆర్‌టీలు, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు కూడా డిజిటల్ విద్యను అందించే క్రమంలో ట్యాబ్స్‌ను అందజేసింది.

సత్సంకల్పంతో..

జిల్లాలో 22 భవిత కేంద్రాల్లో 465 మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుతున్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేని వారికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. మానసిక వైకల్యం ఉన్న విద్యార్థులకు రూ.14వేల విలువైన ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ పరికరాలు, ట్రై సైకిళ్లు, బైక్‌లు, మధ్యాహ్న భోజనంతో పాటు బస్‌పాస్‌లు, వారానికి ఒక రోజు ఫిజియో థెరపీ, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, నెల నెలా గరల్స్ స్టైపెండ్ పేరిట రూ.200, హోమ్ బేస్డ్ అలవెన్స్‌గా నెలకు రూ.300, రీడర్ అలవెన్స్‌గా రూ.300, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌గా రూ.300, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.300 నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. తాజాగా మూగ, వినికిడి, దృష్టి లోపంతో పాటుగా పూర్తిగా కనబడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో వారికి ఆధునిక సాంకేతికతతో కూడిన 160 ట్యాబ్స్‌ను ప్రభుత్వం అందజేసింది. విద్యార్థులతో పాటుగా, వారికి బోధించే ఉపాధ్యాయులకు కూడా ట్యాబ్స్‌ను అందజేసింది. వీటి వినియోగంపై త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఒక రోజు ఓరియంటేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల్లో వెలుగులు నింపేలా..

6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్స్‌లో ఆధునికమైన కంటెంట్‌ను నిక్షిప్తం చేశారు. బీ మై ఎస్, ఎన్ విజన్ ఆల్, గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ అవుట్ లుక్, డాక్స్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు ఉన్న కంటెంట్‌ను ట్యాబ్స్‌లో పొందుపర్చారు. పూర్తిగా చూపులేని వారికి, పాక్షిక అంధులకు, బధిరులు, పాక్షిక బధిరులకు వీలుగా టాక్ బ్యాక్(ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సాంకేతికతల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్), విజిబులిటి ఇన్‌స్ట్రుమెంట్), దృష్టి లోపం ఉన్న వారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూడడానికి ఉపయోగించే యాప్, మిషన్ ఏఐ, ×ఎన్౯ విజన్ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో పనిచేసే) తదితర ప్రత్యేకంగా రూపొందించిన 26 యాప్‌లను ట్యాబ్స్‌లో పొందుపర్చారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు ఉపయోగించుకోకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.29వేలు ఉండగా, వీటికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కీ బోర్డు విలువ రూ.8వేలు ఉంటుంది. మొత్తంగా ఒక్కో ట్యాబ్ విలువ రూ.37వేలు.

జిల్లాలో భవిత కేంద్రాలు	22
విద్యార్థులు	465
ఐఈఆర్‌టీలు	44
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	25
ఫిజియోథెరపిస్టులు	02
ఆయాలు	22

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

ఐఈఆర్‌టీలు	27
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు	25
వినికిడి లోపం ఉన్న విద్యార్థులు	60
దృష్టి లోపం ఉన్న విద్యార్థులు	48

విప్లవాత్మకమైన చర్యలు



ప్రభుత్వం దివ్యాంగుల విద్య విషయంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టడం గొప్ప విషయం. దీని ద్వారా విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు సులువుగా అభ్యసన చేసే వీలుంటుంది.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం

నిరంతర పర్యవేక్షణ



సహిత విద్య అమలు విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికే అందేలా చర్యలు తీసుకుంటున్నాం. డిజిటల్ విద్యలో భాగంగా ట్యాబ్స్‌ను అందజేసి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా దోహదపడుతోంది. ట్యాబ్స్ వినియోగంపై త్వరలోనే ఓరింటేషన్ నిర్వహిస్తాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఘనంగా హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడలోని భానుగుడి పోలీస్ కన్వెన్షన్ హాలులో 61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుశాఖకు అనుబంధంగా హోంగార్డులు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డు వ్యవస్థ ఎంతో కీలకంగా పనిచేస్తుందన్నారు. విజిలెన్స్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, ట్రాన్స్‌పోర్టు, ఫైర్, సబ్‌జైలు తదితర సర్వీసుల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. హోంగార్డుల సంక్షేమాన్ని ప్రభుత్వం గుర్తించిందని, దశలవారీగా వారికి పలు అంశాల్లో ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో హోంగార్డులంతా మరింత అంకిత భావంతో పనిచేసి జిల్లా పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, ఏఆర్‌డీఎస్పీ వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

- ఎనిమిది పోలీసు స్టేషన్‌ల పరిధిలో 11 బైక్‌ల చోరీ
- నిందితుడు వాడపల్లి వాసిగా గుర్తింపు
- చోరీ సొత్తు రికవరీ

కొవ్వూరు: అంతర జిల్లాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న కేసులో మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన పంచదార నవీన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. నిందితుడి వద్ద 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు కేసుల్లో మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విచారణలో చోరీల చిట్టా బయటపడినట్లు ఆయన తెలిపారు. వివిధ జిల్లాల్లో ఎనిమిది పోలీసు స్టేషన్ల పరిధిలో నిందితుడు మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. తణుకు పోలీసు స్టేషన్‌కి సంబంధించి ఒకటి, రాజమహేంద్రవరం టూటౌన్ పరిధిలో రెండు, వన్ టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, త్రీటౌన్ పరిధిలో ఒక మోటారు సైకిల్ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. కోరుకొండ పరిధిలో ఒకటి, అనకాపల్లి టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, విశాఖపట్నం హార్బర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మోటారు సైకిల్‌ను నిందితుడు చోరీ చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితుడి వద్ద 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందుతుడిని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకి హాజరు పరిచినట్లు తెలిపారు.

అమ్మతనపు పాలన



తన పిల్లలతోపాటు మరో తల్లి పిల్లలకు కూడా పాలు ఇస్తున్న ఓ కుక్క

అమలాపురం /టౌన్: 'కంటేనే అమ్మ అని అంటే ఎలా...కరుణించే ప్రతి దేవతా అమ్మే కదా' ఓ సినిమాలోని పాటను గుర్తుకు తెచ్చింది ఆ శునకరాజం. స్థానిక వెత్సావారి అగ్రహారంలో కొద్ది రోజుల కిందట చెరో ఆరు పిల్లలకు జన్మనిచ్చిన రెండు వీధి శునకాలు రోజూ పలు చోట్లకు ఆహారానికి వెళ్లి తమ పిల్లలను సాకుతున్నాయి. అలా ఎప్పటి లాగే పిల్లలను వదలి ఆహారానికి వెళ్లిన ఆ శునకాలు మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు తిరిగి పిల్లల వద్దకు చేరుకోలేకపోయాయి. తల్లి పాల కోసం అల్లాడుతున్న కుక్క పిల్లలను స్థానిక గో ప్రేమికుడు జక్కంపూడి శ్రీనివాసరావు, సీతాకుమారి దంపతులు స్పందించారు. సోమవారం అర్ధరాత్రి వాటిని తమ ఇంటికి తీసుకుని వెళ్లి అప్పటి నుంచి సాకుతున్నారు. పిల్లలను వెతుక్కుంటూ ఓ తల్లి కుక్క బుధవారం మధ్యాహ్నం వచ్చింది. రెండో కుక్క మాత్రం రాలేదు. దీంతో ఆ తల్లి కుక్క తన ఆరు పిల్లలకే కాకుండా, మరో తల్లి కుక్కకు చెందిన ఆరు పిల్లలకు కలిపి పాలు ఇచ్చి తన అమ్మతనాన్ని చాటుకుంది.

యువతి ఆత్మహత్య

యానాం: నియోజకవర్గ పరిధిలోని దరియాలతిప్ప బాలయోగినగర్‌కు చెందిన ఆర్ లక్ష్మీప్రసన్న(21) ఆదివారం మధ్యాహ్నం ఆమె స్వగృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనను గుర్తి తెలియడంతో పోలీసులు ఆమె గృహానికి వెళ్లి మృతదేహాన్ని స్థానిక జిజిహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాల వివరాలను సేకరిస్తున్నట్లు, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేరు నూకరాజు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కొవ్వూరు: కాపవరం గ్రామంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. వీరి నుంచి రూ.19,880 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను గురువారం కోర్టుకి హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

సైనికా ...సలాం!

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం



జిల్లా సైనిక సంక్షేమానికి విరాళం అందజేస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: మాతృభూమి కన్నతల్లితో సమానం..భూమాత ఒడిలో ప్రజలందరూ ఎల్లవేళలా క్షేమంగా ఉండాలని దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాస్తున్నారు భారత సైనికులు. భరతమాత సేవకు జీవితం అంకితం చేస్తున్నారు. కుటుంబం, బంధుత్వాలు, సుఖాలకు దూరంగా ఉంటూ దేశరక్షణే లక్ష్యంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం ఉంది. ఇప్పుడు అటువంటి సైనికుల పట్ల మనకు ఉన్న గౌరవాన్ని చాటుతూ సైనికుల కుటుంబాలకు మేమున్నామంటూ తమ వంతు చేయూతనిచ్చే అవకాశం వచ్చింది. అందుకే గురువారం ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించుకుంటున్నాం.

దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, యుద్ధ సమయంలో అవయవాలను కోల్పోయిన వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1949 డిసెంబర్ 7న త్రివిధ దళాల పతాక దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. అయితే 1993లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ పేరుతో నిధిని ఏర్పాటు చేశారు. దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహించి ఏడవ తేదీన ఫ్లాగ్‌డేగా ప్రజలు, సంస్థల నుంచి విరాళాలు సేకరిస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రంగాలకు చెందిన సైనికులు, వారి కుటుంబీకులు, వితంతవులకు చేయూతనిచ్చేందుకు విరాళాలను సేకరిస్తారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్మును అధికారుల ద్వారా వైకల్యం పొందిన మాజీ సైనికులు/వారి కుటుంబ సభ్యులు,వితంతువులకు అందజేస్తారు.

పతాక దినోత్సవం విశిష్టత..

దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీరజవాన్‌లను కాపాడటంలో నిరంతరం సేవలందించే సైనికులను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునే రోజే త్రివిధ సాయుధ దళాల పతాకదినోత్సవం, ఆరోజు విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్ ప్రజలకు పతాకాన్ని అందించి హుండీ ద్వారా విరాళాలు స్వీకరిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలను పంపవచ్చు. ప్రజలు ఎవరైనా మాజీ సైనికులకు చేయూతనివ్వదలిచిన వారు కాకినాడలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అందజేసి రశీదు పొందవచ్చు. డీడీరూపంలో కానీ, నెఫ్ట్ ద్వారా కానీ జిల్లాసైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, ఈస్ట్‌గోదావరి అండ్ కాకినాడ పేరుతో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లాపరిషత్ బ్రాంచ్, కాకినాడ, అకౌంట్ నంబర్ 62064060623, ఐఎఫ్ఎస్‌సీకోడ్ ఎస్‌బీఐఎన్0020974, ఎంఐసీఆర్ కోడ్ –533002028కు పంపవచ్చు. విరాళాలు ఇచ్చే వారికి సెక్షన్ 80జీ ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది.

దేశసైన్యంలో ఉమ్మడి జిల్లా ప్రాధాన్యం

దేశసైన్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో సైన్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా వాసులు పనిచేయడం మన జిల్లాకు దక్కిన గౌరవం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్రివిధ దళాల్లో 2,981 మంది మాజీ సైనికులు పనిచేసి ఉన్నారు. వీరిలో ఆర్మీలో 2059, ఎయిర్‌ఫోర్స్‌లో 666, నేవీలో 256మంది ఉన్నారు. వీరితోపాటు సైన్యంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వితంతువులు ఆర్మీలో 1,286 మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 129మంది, నేవీలో 33మంది ఉన్నారు. వీరందరికి ప్రభుత్వ పరంగా పలు ప్రయోజనాలు అభిస్తున్నప్పటికీ వారి సేవలకు ఎంతచేసినా తక్కువే అన్న భావనతో పౌరులు స్పందించి తోచిన సాయం చేసి సైనికులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే యత్నం చేయాలి.

సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందాం



దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన వీర సైనికులను, వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నాం. దేశసైనికుల చేసిన సేవలకు వెలకట్టలేం. తోచిన సాయం చేసి వారి కుటుంబాలకు మేమున్నామన్న భరోసా కల్పించడమే లక్ష్యం.

– కెప్టెన్ డాక్టర్ పి.సత్యప్రసాద్ (విశ్రాంత), జిల్లా సైనిక సంక్షేమాధికారి, తూర్పుగోదావరి జిల్లా

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

పాల్గొన్న మూడు జిల్లాల ఎస్పీలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం ఉమ్మడి గోదావరి జిల్లా పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు, క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఇరు పక్షాల వారికి జాతీయ లోక్ అదాలత్‌పై తెలియజేసి వారి సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఎస్పీ పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్పీ పి.సతీష్ కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ పి.సోమశేఖర్, ఎక్సైజ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లా మహిళా సమాఖ్య సమావేశం

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధిలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశం గురువారం స్థానిక టీటీడీసీలో జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షత వహిస్తారన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

9న జాబ్‌మేళా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు బుధవారం తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్‌లో విశాఖకు చెందిన నిర్మాణ్, ఆర్గ్ జాబ్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ డ్రైవ్‌లో నవత ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, అరబిందో ఫార్మా, డైకిన్ ఏసీ, హెటిరో లాబ్స్, హీరో మోటార్ కార్ప్, టాటా కాపిటల్ ఫైనాన్స్, శ్రీ రామ్ చిట్స్ అండ్ ఇన్సూరెన్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, నియోలింక్ కంపెనీ, అపోలో ఫార్మసీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ప్రారంభ వేతనం రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం, విశాఖ, హైదరాబాద్, సూళ్లూరుపేట శ్రీ సిటీలలో ఉద్యోగాలు ఉంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఎంఎస్సీ చదివిన ఆసక్తి గల విద్యార్థులు అర్హత ప్రమాణ పత్రాల నకళ్లతో పాటు, బయోడేటా ఫారంతో ఇంటర్వ్యూ కు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73866 62879, 96852 18818 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

అకడమిక్ ఫెస్ట్‌లో ఆర్ట్స్ కళాశాలకు రోలింగ్ షీల్డ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ అటానమస్ ఆర్ట్స్ కళాశాల 2022, 23వ సంవత్సరానికి గాను కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నిర్వహించే అకడమిక్ ఫెస్ట్‌లో రోలింగ్ షీల్డ్‌ను సాధించింది. ఈ మేరకు ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు బుధవారం వెల్లడించారు. విద్యార్థి, అధ్యాపక, కళాశాల మూడు కేటగిరీలలో అవార్డులను సీసీఈ అకడమిక్ ఫెస్ట్ అనే ప్రోగ్రాం ద్వారా అందిస్తోంది. మొత్తం 168 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు పాల్గొన్న అకడమిక్ ఫెస్ట్‌లో ఆర్ట్స్ కళాశాల మూడు విభాగాల్లో మొత్తం 19 అవార్డులు సాధించింది. అవార్డుల ప్రదానోత్సవం ఈ నెల 16న అనంతపురం ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో జరుగనుంది. ఇంటర్న్‌షిప్ యాప్‌ను సమర్థవంతంగా విద్యార్థులు, అధ్యాపకుల ద్వారా వినియోగింపచేస్తున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు, మెంటార్ వై.రాముకు అవార్డు ఇవ్వనున్నారు.

నేడు 'ఉన్నతి మహిళాశక్తి' ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నతి మహిళా శక్తి ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆటో రిక్షా పంపిణీ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. వీణాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా రూ.18,84,116/– వ్యయంతో కొనుగోలు చేసిన 6 ఆటోలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఇందులో లబ్ధిదారుల వాటా 10 శాతం కాగా మిగిలిన 90 శాతం రుణం మొత్తం – రూ.17,32,000/– బ్యాంకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీ కమ్యూనిటీలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు వారి స్థిరమైన జీవనోపాధి కోసం ఉన్నతి కార్యకలాపాల వడ్డీ రహిత రుణం కింద ఆటో రిక్షాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎంపీ.మార్గాని భరత్‌రామ్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు, లబ్ధిదారులు పాల్గొంటారని వీణాదేవి తెలిపారు.